క్లుప్తంగా

రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంతాల్లో నివసించే వారందరికీ మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని బ్రహ్మం గారి మఠం, ఒడ్రు పేట, దుక్కా తిరుపతమ్మ వీధి, కమ్యూనిటీ హాల్ ప్రాంతాల్లో రూ.20 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు శనివారం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆది లక్ష్మి మాట్లాడుతూ.. కొండ ప్రాంతంలో దెబ్బతిన్న మెట్లు, డ్రెయిన్లకు మరమ్మతులు చేపట్టాలని 155వ సచివాలయం పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును కోరారన్నారు. వెంటనే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి అయ్యేలా చూడాలని కార్పొరేషన్ సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు(జగ్గు), చలమలశెట్టి జగదీష్, రాళ్లపూడి సూరిబాబు, దుక్క హరి, భాస్కర్, బాయన అమర్‌నాథ్ పాల్గొన్నారు.

16 నుంచి కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ తరగతులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 16వ తేదీ నుంచి కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎం.బి.విజ్ఞాన కేంద్రం శిక్షణ విభాగం కన్వీనర్ రామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో ట్యాలీ ఇన్ అడ్వాన్స్‌డ్, ట్యాలీ ఇన్ జీఎస్టీ, ఎంఎస్ ఆఫీస్, పేజ్‌మేకర్ అండ్ ఫొటోషాప్, ఎంఎస్ ఆఫీస్, అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, పవర్ బీఐ, ఇంటర్‌నెట్ కాన్సెప్ట్స్, సీ లాంగ్వేజ్, పైథాన్ కోర్సుల్లో కొత్త బ్యాచ్‌లకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వివిధ బ్యాచ్‌లకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 14వ తేదీలోగా 0866 2578044 నంబర్‌లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

వినూత్నంగా ఫ్రెండ్ షిప్ డే వేడుకలు

పాయకాపురం(విజయవాడరూరల్): ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను మాస్టర్ మైండ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్ విద్యార్థులు శనివారం వినూత్నంగా నిర్వహించారు. చెట్లతో స్నేహం చేస్తూ వాటిని పరిరక్షించాలని తెలుగు తల్లి పార్కులోని చెట్లకు విద్యార్థులు ఫ్రెండ్ షిప్ బ్యాండ్‌లను కట్టారు. కాలుష్యం బారి నుంచి కాపాడేవి చెట్లను ప్రతి ఒక్కరూ చెట్లను పెంచాలన్నారు. భావితరాలకు కాలుష్య రహిత వాతావరణాన్ని అందించడానికి మన వంతు కృషి చేయాలని కోరారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

పాయకాపురం(విజయవాడరూరల్): అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన రూ.10 వేలను 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. డివిజన్‌లోని సెవెన్ అపార్ట్‌మెంట్ వద్ద నివసిస్తున్న కుంభ వాకిలయ్య అనారోగ్యంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను కార్పొరేటర్ అందజేశారు. మిగిలిన బీమా నగదు త్వరలో మంజూరు అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అలంపూరు విజయ్, సచివాలయ ఉద్యోగులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డలకు శ్రేయస్కరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): తల్లి పాలు బిడ్డలకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయ అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా శనివారం భానునగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లి పాలతో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని పేర్కొన్నారు. బిడ్డలకు పాలు ఇవ్వడం తల్లీ బిడ్డలు ఇద్దరికీ ఎంతో ప్రయోజనకరమని వివరించారు. ఏఎన్‌ఎం కుమారి మాట్లాడుతూ.. తల్లి పాలలో ఉండే పోషకాలు బిడ్డ ఎదుగుదలకు దోహదం చేస్తాయని తెలిపారు. బిడ్డ పుట్టగానే తల్లి ముర్రుపాలు తప్పకుండా తాగించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి కె.భవాని, నాగదుర్గా భవాని, మృణాళిని పాల్గొన్నారు.

కళాకారుల్లోని ప్రతిభను ప్రోత్సహించాలి

విజయవాడకల్చరల్: కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శ్రావణ మాసం సందర్భంగా శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ అలంకరణ పోటీలను బీఆర్టీఎస్ రోడ్డులోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. సృజనాత్మకతో అమ్మవారిని సుందరంగా అలంకరించిన పోటీదారులను, నిర్వాహకులను అభినందించారు. డెప్యూటీ మేయర్ శ్రీశైలజ మాట్లాడుతూ శ్రావణమాసం మహిళలకు ప్రీతి పాత్రమైనదన్నారు. నిర్వాహకురాలు దూపటి శ్రీదేవి మాట్లాడుతూ ప్రతీ ఏటా సాంస్కృతిక సంక్షేమ సంఘం ద్వారా అనేక పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కొండ ప్రాంత అభివృద్ధికి చర్యలు

- రూ.1.30 కోట్లతో రిటైనింగ్ వాల్స్, తాగునీటి పైప్ లైన్ నిర్మాణాలు
- పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి



50వ డివిజన్‌లో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, ప్రజాప్రతినిధులు

వించిపేట(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంత వాసుల సమస్యల పరిష్కారానికి యుద్ధప్రతిపాదికన పనులు చేపట్టినట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. 50వ డివిజన్‌లో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గొల్లపాలెంగట్టు కొండ ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించిన సందర్భంలో గతంలో కురిసిన వర్షాలకు రిటైనింగ్ వాల్స్ జారి పడిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. అదే విధంగా కొండ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో తామంతా ఇబ్బందులు పడుతున్నట్లు తెలపడంతో వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం గొల్లపాలెంగట్టు కొండప్రాంతం, పోతురాజువీధి, జెండా చెట్టువీధి, కొండ్రు వారివీధి కొండ ప్రాంతంలో రిటైనింగ్ వాల్స్ నిర్మాణానికి నగరపాలకసంస్థ సాధారణ నిధుల నుంచి రూ.85 లక్షలు మంజూరు చేశారు. అదే విధంగా తాగునీటి పైపు లైన్‌లు దెబ్బతిని కొండ ప్రాంతాల్లో సక్రమంగా తాగునీరు సరఫరా జరగకపోవడంతో కొండ ప్రాంతాలలో పాత తాగునీటి లైన్‌లను తొలగించి కొత్త లైన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు సీసీ రోడ్ల నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.45 లక్షలను మంజూరు చేయించారు. ఈ మేరకు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలసి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశామన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో గతంలో ఎన్నడు లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు త్వరలోనే కొండ ప్రాంతం జెండాచెట్టు రోడ్డులో మినీ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బోయి సత్యబాబు, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి బంకా విజయ, నాయకులు సైకం సాయిబాబు, చాముండేశ్వరి, బంకా శివ, కామరాజ్ హరీష్, రమేష్, నగరపాలకసంస్థ అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్‌తో ఉజ్వల భవిష్యత్



వీసాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): హోటల్ మేనేజ్‌మెంట్‌తో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక బావాజీపేట సి కన్వెన్షన్ హాల్‌లో యునైటెడ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యాన విజయవాడ 'సంయుక్త- ఎ టాలెంట్ ఫెస్ట్ 2023 ' పేరిట సాంస్కృతిక ఉత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని చెప్పారు. విదేశీ విద్య ద్వారా నిరుపేదలు సైతం ఇతర దేశాల్లో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. యునైటెడ్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందిస్తున్నామని అందుకే దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. కళాశాల డైరెక్టర్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ.. ఇంటర్నేషనల్ ప్లేస్‌మెంట్స్‌లో తమ సంస్థ ద్వారా 20 మంది ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఎమ్మెల్యే విష్ణు చేతుల మీదుగా వీసాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి, యునైటెడ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జె.జగదీష్, అడ్మిన్ మేనేజర్ ఉషా కంచెర్ల, అధ్యాపకులు సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధింపులకు గురి చేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంబాపురం గ్రామంలోని సీఎస్‌ఐ చర్చి ప్రాంతానికి చెందిన దేవరపల్లి చాందిని రెండేళ్ల కిందట ఏలూరు జిల్లాకు చెందిన కృపాకర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. చాందిని గ్రామంలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తోంది. కొంత కాలంగా కృపాకర్ భార్యపై అనుమానంతో వేధింపులకు గురి చేయసాగాడు. కొద్ది రోజుల కిందట చాందిని పుట్టింటికి వచ్చేయగా, కృపాకర్ తల్లి వెంకమ్మ, చెల్లెలు కరణ, పాత వీరయ్యలు వచ్చి గొడవకు దిగారు. అదనంగా కట్నం తీసుకువస్తేనే కాపురానికి తీసుకువెళ్లేదని, బెదిరింపులకు పాల్పడటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రహదారిపై నిలిచి ఉన్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘటనపై బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జి.కొండూరు మండలం కందులపాడుకు చెందిన వై.సాంబశివరావు కందులపాడు పాలకేంద్రానికి ప్రెసిడెంట్‌గా పని చేస్తున్నారు. విజయ డెయిరీకి పోసే పాల డబ్బులు కోసం ప్రతి 15 రోజులకు ఒకసారి విజయవాడ వస్తుంటాడు. శుక్రవారం పాలప్రాజెక్టుకు వచ్చిన సాంబశివరావు తిరుగు ప్రయాణంలో పాముల కాల్వ వద్ద రోడ్డు మధ్యలో నిలిపి ఉన్న గుర్తు తెలియని వాహనాన్ని సాంబశివరావు తన బైక్‌తో ఢీ కొట్టాడు. దీంతో సాంబశివరావు తలకు గాయం కావడంతో పాదచారులు ఫోన్‌లో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సాంబశివరావు భార్య సత్యవతి, సోదరుడు శ్రీనివాసరావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. సాంబశివరావును 108పై విజయవాడలోకి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ముదిరాజ్ కమ్యూనిటీహాల్ ఏర్పాటుకు వినతి



ఎమ్మెల్యే వెలంపల్లికి వినతిపత్రం అందజేస్తున్న నారాయణ ముదిరాజ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని మూడు నియోజకవర్గాల్లో వెనుకబడిన సామాజికవర్గంగా గుర్తింపు పొందిన ముదిరాజులకు ఒక కమ్యూనిటీహాల్‌ను ఏర్పాటు చేయాలని ఏపీ ముదిరాజ్/ముత్రాసి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొర్న వెంకట నారాయణ ముదిరాజ్ కోరారు. ఈ మేరకు ఆయన శనివారం సాయంత్రం ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణువర్ధన్‌లను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్ సామాజికవర్గానికి సంబంధించి ఏదైనా కార్యక్రమంగానీ, వివాహాది శుభకార్యాలను జరుపుకునేందుకు సరైన భవనం లేదని వారి దృష్టికి తీసుకువెళ్లారు. వెనకబడిన కులానికి చెందినవారు కావడంతో చిన్న చిన్న ఫంక్షన్లు చేసుకోవాలన్నా ప్రైవేట్ కల్యాణమండపాల అద్దెలు భరించలేక ఇళ్ల ముందు రోడ్లపైనే జరుపుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. శాసనసభ్యులను కలిసిన వారిలో ఏపీ ముదిరాజ్ మహాసభ కార్యదర్శి బోనం వెంకటయ్య, యువజన విభాగం అధ్యక్షుడు కోలా కొండముదిరాజ్, ఐటీ విభాగం అధ్యక్షుడు పిట్టల అల్లూరయ్య(రాజు), ఎన్టీఆర్ జిల్లా యూత్ జనరల్ సెక్రటరీ శివాజీ, విజయవాడ సిటీ ప్రెసిడెంట్ రామరాజు, కార్పొరేషన్ డైరెక్టర్ కంభం కొండలరావు ముదిరాజ్ ఉన్నారు.

బీసీ కమ్యూనిటీహాల్ నిర్మాణంపై హర్షాతిరేకాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 31వ డివిజన్ బీసీల చిరకాల కోరికగా మిగిలిన బీసీ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి నగరపాలకసంస్థ కౌన్సిల్ ఆమోదించటం బీసీల పట్ల ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ పెనుమత్స శిరీషల చిత్తశుద్ధిని తెలియజేస్తుందని పలువురు బీసీ నేతలు అన్నారు. స్థానిక 31వ డివిజన్ ముత్యాలంపాడులో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పేద, మధ్య తరగతి వర్గాలు అధికంగా ఉండే జీఎస్ రాజు రోడ్డులో దోబీఖానా పక్కన నిరుపయోగంగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ప్రాంతంలో బీసీల కమ్యూనిటీ హాలు నిర్మించాలని గడప, గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు విజ్ఞప్తి చేశామన్నారు. దీనిపై స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి, ప్రతిపాదనలు పంపించి కౌన్సిల్‌లో ఆమోదింప చేశారని హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ పెనుమత్స శిరీషలకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు కొండూరు ఏసుబాబు, కె.సాంబయ్య, ఏ విజయ్, సాయి, కలవకోల్లు వెంకటేశ్వరరావు, నక్కా గోవిందు, ఆర్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తల్లి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తల్లి అదృశ్యంపై కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట టీఎస్పీ వీధి కొండ ప్రాంతంలో నోట్ల శ్రీనివాసరావు కుటుంబం నివాసం ఉంటుంది. శ్రీనివాసరావుకు వివాహం కాగా, భార్య డెలివరీ కోసం అమలాపురంలోని పుట్టింటికి వెళ్లింది. తల్లి సింహచలం వీఎంసీలో పని చేస్తుంటుంది. ఈ నెల 3వ తేదీ ఉదయం శ్రీనివాసరావు పనికి వెళ్లి రాత్రి 9 గంటలకు వచ్చే సరికి ఇంటికి తాళం వేసి ఉంది. చుట్టుపక్కల వారిని ఆరా తీయగా అనకాపల్లి వెళ్తున్నట్లు చెప్పినట్లు తెలుసుకుని ఫోన్ చేశాడు. అయితే ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో అనకాపల్లిలోని బంధువులు, స్నేహితులను విచారించగా, ఆమె అక్కడకు రాలేదని తెలిసింది. దీంతో తల్లి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అజిత్‌సింగ్‌నగర్ ఎస్‌ఐ దుర్గాదేవి చెప్పారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీ సర్కిల్ వద్ద ఆటో డ్రైవర్లకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. కొంతమంది ఆటో డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం వల్ల వారితో పాటు ఆటోలోని ప్రయాణికులకు, వారి పక్కన వెళ్లే వాహనదారులకు అనేక నష్టాలు కలుగుతున్నాయన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, రోడ్లపై ఇష్టం వచ్చినట్లుగా వాహనాలను నడపడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వంటి ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. ఆటోడ్రైవర్లు కచ్చితంగా ఖాకీ దుస్తులు ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు, ఆర్టీఏ నిబంధనలను పాటించాలని సూచించారు. నిబంధనలను పాటించని వారిపై జరిమానాలు విధించడంతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సెప్టెంబర్ 3న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

విజయవాడకల్చరల్: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3వ తేదీన 39వ బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘ క్రియాశీలక సభ్యులు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, ఈవని శ్రీరామచంద్ర మూర్తి, తణుకు రామకృష్ణ, పెద్దిభొట్ల కాశీ విశ్వనాథం శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ అన్ని వయసుల వారికి, అర్చక పురోహితులకు, దివ్యాంగులు, ద్వితీయ వివాహం వారికి ఈ పరిచయ వేదికలో అవకాశం ఉంటుందని ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సత్యనారాయణపురం శివాలయం ఎదురుగా కల పాదు క్షేత్రంలో 94407 51646, 98485 36386 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

• నగరానికే తలమానికం





విజయవాడ నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు నగరానికే తలమానికంగా నిలుస్తున్నాయి. స్వరాజ్యమైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంబేద్కర్ స్మృతివనం పనులతో పాటు కృష్ణలంకలో రిటైనింగ్ వాల్ సుందరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇవి నగర వాసులతో పాటు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రసాయన పరిశ్రమల్లో ప్రమాదాలకు తావులేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి క్రైసిస్ గ్రూప్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇబ్రహీంపట్నం, జి. కొండూరు మండలాల్లో హెచ్‌సీఎల్, బీపీసీఎల్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, గెయిల్ వంటి పెట్రోలియం, గ్యాస్ సంబంధించిన కంపెనీలు ప్రమాదాలు జరిగే కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయన్నారు. ఈ కంపెనీల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదాల నివారణకు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో జాతీయ స్థాయిలో జరిగిన దుర్ఘటనలపై సభ్యులతో చర్చించి అవగాహన కల్పించారు. అగ్ని మాపక సిబ్బంది సూచనలను పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించేందుకు వీలవుతుందన్నారు. సమావేశంలో డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ జేడీ ఎస్.నాగమణమ్మ, ఏసీపీ కె.వి.డి.వి ప్రసాద్, ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రిజర్వేషన్లతోనే సామాజిక న్యాయం



సెమినార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారతదేశంలో అన్ని వ్యవస్థల్లోనూ, రంగాల్లోనూ రిజర్వేషన్లు అమలు చేస్తేనే సామాజిక న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో ఏఐడీఆర్‌ఎం జాతీయ సమితి సమావేశాల సందర్భంగా రిజర్వేషన్లపై శనివారం సెమినార్ జరిగింది. సెమినార్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం దక్కాలంటే అన్ని రంగాల్లోనూ ఆయా వర్గాలకు రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ముఖ్యంగా న్యాయ వ్యవస్థలో రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. న్యాయవ్యవస్థలో దశాబ్దాలుగా ఒక కులం ఆధిపత్యం సాగిస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన కేబినెట్‌లో ఎస్సీ, బీసీలకు అత్యధిక ప్రాధాన్యత నిచ్చారని గుర్తు చేశారు. మాజీ జడ్జి పి.గురవప్ప మాట్లాడుతూ న్యాయస్థానాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఏఐడీఆర్‌ఎం జాతీయ అధ్యక్షుడు ఏ రామమూర్తి, జాతీయ కార్యదర్శి వి.ఎస్.నిర్మల్, దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్‌లు మాట్లాడుతూ.. జడ్జి నియామకాలపై సామాజిక పొందిక ఉండాలన్నారు. న్యాయస్థానాల్లో జడ్జిల నియామకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని సెమి నార్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ ఉద్యమంలో ఇది తొలి అడుగు కావాలని ఆకాంక్షించారు. సెమినార్‌లో సీపీఐ రాష్ట్ర నాయకులు దోనేపూడి శంకర్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, నాయకులు బుట్టి రాయప్ప, కుమారి నంద, ఏసురత్నం, కొరివి వినయ్ కుమార్, జి.నటరాజ్, ఏఐటీయూసీ నాయకులు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఫ్రూట్స్ డే వేడుకలు



పండ్ల వేషధారణలో చిన్నారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక క్రాంబ్వే రోడ్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో శనివారం నిర్వహించిన ఫ్రూట్ డే వేడుకలు సందడిగా సాగాయి. కార్యక్రమంలో భాగంగా ప్రైమరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులు వివిధ రకాల పండ్ల వేషధారణలో చూపరులను ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సెయింట్ జాన్స్ పాఠశాల సెక్రటరీ,కరస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజ్ మాట్లాడుతూ పండ్లలో ఉండే పోషకాలను వివరించారు. ఏ సీజన్‌లో వచ్చే పండ్లను ఆ సీజన్‌లో తినాలని, తద్వారా వచ్చే ఆరోగ్య ఫలితాలు అద్భుతంగా ఉంటాయని చెప్పారు. అనేక పోషక విలువలు ఉన్న పండ్లను తింటే రోగాలు దరిచేరవని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న వయసు నుంచే పండ్లను తినటం అలవాటు చేయాలని, జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ సుచరిత, కో ఆర్డినేటర్ బి.సౌమ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో డీఎస్‌ఎంసీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న హెచ్‌ఎం కోటయ్య, ఉపాధ్యాయులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్ టాలెంట్ టెస్ట్‌లో విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్(డీఎస్‌ఎంసీ) హైస్కూల్ విద్యార్థులు ఉత్తీర్ణులై స్కాలర్‌షిప్‌ను సాధించారు. హైస్కూల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎన్‌ఎంఎంఎస్ టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి విద్యార్థులు కామినేని సుమంత్, షేక్ రిజ్వానా, గోరంట్ల జశ్వంత్ సాయిలకు విద్యా శాఖ పంపిన సర్టిఫికెట్స్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాతంగి కోటయ్య వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ ముగ్గురు విద్యార్థులకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేలు చొప్పున నగదు పారితోషకం అందజేస్తారని చెప్పారు. కష్టమైనా ఇష్టపడి చదివితే తప్పకుండా విజయం సాధిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డీవీ మురళీ ప్రసాద్, జె.భానుప్రకాష్, ఎం .కమల కుమారి పాల్గొన్నారు.